సాక్షి
ఖమ్మం
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



కౌలుదారుల కబంధ హస్తాల్లో..
సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలో గిరిజనులకు ఇచ్చిన భూమిని కౌలుదారులే అనుభవిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. 8లో



ఇంటింటా జ్వరమే
నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుండగా ప్రభుత్వ ఆస్పత్రి కిటకిటలాడుతోంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
32° / 23°
జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం జరిపించిన అర్చకులు.. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు. పూజల్లో ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎంపీ రఘురాంరెడ్డి

- జిల్లా పర్యటనకు రావాలని ఆహ్వానం



గవర్నర్‌తో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, సురేందర్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఆయన తండ్రి మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి శనివారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం ఖిల్లా, దక్షిణ ఆసియాలోనే పెద్దదైన బౌద్ధస్థూపం, కూసుమంచిలోని కాకతీయుల కాలం నాటి శివాలయం, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు సింగరేణి గనులు ఉన్నాయని వివరించారు. వీటి పర్యటనకు రావాలని గవర్నర్‌ను ఆహ్వానించిన ఎంపీ.. తద్వారా మరింత ప్రాచుర్యం కల్పించినట్లవుతుందని పేర్కొన్నారు. దీనిపై గవర్నర్ స్పందిస్తూ త్వరలోనే ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తానని పేర్కొనగా ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

మెప్మా పీడీగా మహేందర్



పి.మహేందర్

ఖమ్మంమయూరిసెంటర్: మెప్మా జిల్లా పీడీగా పి.మహేందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల ఖమ్మం పీడీగా బదిలీ చేశారు. మెప్మా పరిధిలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు ఉండగా, ఐదేళ్ల నుంచి ఖాళీగా ఉన్న పీడీ పోస్టును ప్రభుత్వం ఎట్టకేలకు భర్తీ చేసింది. మెప్మా పీడీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహేందర్ కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలవగా.. అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

డీవైఎస్‌ఓగా వాలీబాల్ కోచ్‌కు పదోన్నతి



ఎం.డీ.అక్బర్ అలీ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన, క్రీడా శాఖలో వాలీబాల్ కోచ్‌గా కొనసాగుతున్న ఎం.డీ.అక్బర్ అలీకి డీవైఎస్‌ఓగా పదోన్నతి లభించింది. ఆయనను నల్లగొండ డీవైఎస్‌ఓగా నియమిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2016 నుంచి వాలీబాల్ కోచ్‌గా ఖమ్మంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన వందలాది మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా తర్ఫీదునిచ్చారు.

మట్టి దందాకు పాల్పడితే కఠిన చర్యలు

రఘునాథపాలెం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి తీసుకోకుండా మట్టి తవ్వినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి హెచ్చరించారు. రఘునాథపాలెం మండలంలో మట్టి తవ్వకాలు చేపడుతున్న 17మందికి శనివారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా సరే నిబంధనలు పాటించాలే తప్ప ఇష్టారాజ్యంగా వ్యవహరించొద్దని సూచించారు. అనంతరం వ్యాపారులను తహసీల్దార్ లూర్దువిల్సన్ ఎదుట బైండోవర్ చేసి వ్యక్తిగత పూచీకత్తుపై పంపించారు. ఈకార్యక్రమంలో సీఐ ఉస్మాన్‌షరీఫ్ పాల్గొన్నారు.

ఆపద ఏదైనా.. మేం సిద్ధం

సండే స్పెషల్

ఆపద ఏదైనా ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటారు.. వరద వస్తే సహాయక చర్యలు చేపట్టడంలో ముందు నిలుస్తారు.. శిథిల భవనాలు, గోడలు కూలినా.. చెట్లు విరిగినా క్షణాల్లో చేరుకుని తొలగిస్తారు.. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డీఆర్‌ఎఫ్ (డిజాస్టర్ రిసోర్స్ ఫోర్స్) సభ్యులు సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటూ మన్ననలు పొందుతున్నారు. గత ఏడాది జూలైలో మున్నేరు వరదల సమయాన స్థానికులను అప్రమత్తం చేయడమే కాక వరదలో చిక్కుకున్న వారిని బయటను తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) తర్వాత డీఆర్‌ఎఫ్ టీం ఏర్పాటు చేసుకున్న మున్సిపల్ కార్పొరేషన్‌గా ఖమ్మం నిలుస్తుండగా.. విపత్తు సమయాల్లో వారి సేవలు ఉపయోగపడ్డాయి.

డీఆర్‌ఎఫ్ టీం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కథనం.

– ఖమ్మంమయూరిసెంటర్



మున్నేరు వరదల సమయాన మహిళను తీసుకొస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది (ఫైల్)

విపత్తుల వేళ సహాయక చర్యల్లో డీఆర్‌ఎఫ్
- వరద వచ్చినా.. చెట్లు కూలినా వెంటనే రంగంలోకి...
- కేఎంసీ డీఆర్‌ఎఫ్ టీం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి



రహదారిపై కూలిన చెట్టును తొలగిస్తూ...

ప్రత్యేక శిక్షణ
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో 20 మంది సిబ్బందితో డీఆర్‌ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేయగా 2020 ఆగస్టు, 2022 ఆగస్టు ల్లో ఇరవై రోజుల చొప్పున హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. అక్కడి ఇందిరా పార్క్ వద్ద స్విమ్మింగ్‌పూల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ ట్రెయినర్లతో శిక్షణ ఇప్పించడమే కాక 2023లో ఖమ్మంలోని ప్రకాశ్‌నగర్ చప్టా వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో బోటు నడపడం, వరదల్లో కొట్టుకుపోయే వారిని కాపాడడంపై శిక్షణ ఇచ్చారు.

క్షణాల్లో ఘటనాస్థలానికి..
కేఎంసీ పరిధిలో ఎక్కడ విపత్తు ఎదురైనా 20 మందితో కూడిన డీఆర్‌ఎఫ్ బృందం ఘటనా స్థలానికి చేరుకుంటుంది. వర్షాకాలంలో గాలిదుమారానికి విరిగిపడే చెట్లు, కూలిపోయే శిథిల భవనాలను తొలగించడంలో ముందు నిలుస్తున్నారు. ఈ ఏడాది పలుమార్లు డంపింగ్ యార్డ్‌లో మంటలు చెలరేగి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పొగతో ఉక్కిరిబిక్కిరి కాగా డీఆర్‌ఎఫ్ సభ్యులే రాత్రీపగలు తేడా లేకుండా మంటలు ఆర్పి పరిస్థితులను చక్కదిద్దారు.

మున్నేరు వరదల్లో..
2023 జూలై 26, 27వ తేదీల్లో మున్నేరుకు వరద వచ్చిన సమయాన కేఎంసీ డీఆర్‌ఎఫ్ టీం అందించిన సేవలు ఇప్పటికీ స్థానికులు గుర్తుచేసుకుంటారు. గంటగంటకు వరద పెరుగుతుండగా అధికారుల ఆదేశాలతో మున్నేటి ముంపు ప్రాంతం నుంచి స్థానికులను ఖాళీ చేయించడంలో చొరవ చూపారు. ఓ పక్క వరద పెరుగుతున్నా.. ఇళ్లల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ టీంతో కలిసి వరద సహాయక చర్యలు చేపట్టిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది మూడు, నాలుగు రోజుల పాటు వంతుల వారీగా గస్తీ కాశారు.

ఎక్కడైనా ముందు వరుసలో..
డీఆర్‌ఎఫ్ సభ్యులను కేఎంసీ అధికారులు రెండు బృందాలుగా విభజించారు. నగరంలో ఫ్లెక్సీలు, చెట్ల కొమ్మలు, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వీరిని వినియోగిస్తున్నారు. అలాగే, భారీ వర్షాలు కురిసినప్పుడు డ్రెయిన్లు, రహదారులపై వరద నిలిచినా వ్యర్థాలను తొలగించి నీరు సాఫీగా చర్యలు చేపడుతున్నారు. ఏ సమయమైనా అధికారులకు అందుబాటులో ఉంటూ వారి ఆదేశాల ప్రకారం ఘటనా స్థలాలకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారు. అంతేకాక పలు ప్రొటోకాల్ పనులకు సైతం ఈ బృందం సేవలను అధికారులు వినియోగించుకుంటున్నారు.

ఉత్తమ సేవలు అందిస్తున్నారు..



డీఆర్‌ఎఫ్ టీం ఏర్పాటయ్యాక విపత్తులను సులభంగా ఎదుర్కొంటున్నాం. మున్నేరు వరదల సమయాన ప్రజలను బయటకు తీసుకరావడంలో సిబ్బంది చూపిన తెగువ మరిచిపోలేం. చెట్లు కూలినా, గోడలు పడినా తొలగించి ప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు.
– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

సమాచారం అందితే చాలు..



చెట్లు విరగడం, గోడలు కూలడమేకాక లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరినప్పుడు అక్కడకు వెళ్లి సమస్య పరిష్కరిస్తున్నాం. మా బృందానికి హైదరాబాద్‌లో ఇచ్చిన శిక్షణ ఉపయోగపడుతోంది. బాధ్యతగా పనిచేస్తుండడంతో అధికారుల నుండి అభినందనలు అందుతున్నాయి.
– ఆరెంపుల బ్రహ్మం, సూపర్‌వైజర్, డీఆర్‌ఎఫ్, కేఎంసీ

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించాక స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ ధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆర్టీసీ ఉత్తమ డిపోగా సత్తుపల్లి

- ఉత్తమ బస్‌స్టేషన్‌గా ఖమ్మం కొత్త బస్టాండ్
- రీజియన్‌లో ఐదుగురు ఉద్యోగులకూ అవార్డులు

ఖమ్మంమయూరిసెంటర్/సత్తుపల్లి టౌన్: రాష్ట్రంలోనే టీజీఎస్ ఆర్టీసీలో ఉత్తమ డిపోగా ఖమ్మం రీజియన్ పరిధి సత్తుపల్లి బస్ డిపో, ఉత్తమ బస్ స్టేషన్‌గా ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ప్రగతి చక్రం పురస్కారాలు దక్కాయి. ఏటా ఉత్తమ డిపో, బస్టాండ్, ఉద్యోగులను ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తుండగా ఈ ఏడాది సత్తుపల్లి డిపో, ఖమ్మం కొత్త బస్టాండ్‌కు చోటు దక్కింది. కాగా, సత్తుపల్లి డిపో 2022 నుంచి లాభాల బాటలో పయనించడంతో పాటు ప్రమాదరహితంగా కాక ఇతర కేటగిరీల్లోనూ ప్రతిభ చూపడంతో గతేడాది రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి సాధించగా ఈ ఏడాది ప్రథమ స్థానంలో సాధించడం విశేషం. ఇక బెస్ట్ పీఎంస్ కోర్ గ్రూప్ సూపర్‌వైజర్‌గా రీజనల్ కార్యాలయం నుండి బి.సైదులు, బెస్ట్ మెకానిక్‌గా మణుగూరు డిపోకు చెందిన పి.రవి, బెస్ట్ హెల్పర్‌గా మణుగూరు డిపోకు చెందిన డి.సతీష్‌కుమార్, బెస్ట్ హైర్ బస్ డ్రైవర్లుగా సత్తుపల్లి డిపోకు చెందిన సీహెచ్.కిషోర్‌బాబు, కె.రాంబాబు ఎంపికయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డులు ప్రదానం చేశారు. రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ఆధ్వర్యాన సత్తుపల్లి డిపో తరఫున రూ.3లక్షల నగదు బహుమతిని మేనేజర్ యూ.రాజలక్ష్మి, ఖమ్మం కొత్త బస్టాండ్‌కు వచ్చిన అవార్డును ఖమ్మం డీఎం దినేష్‌కుమార్, స్టేషన్ మేనేజర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్.సాహితీ తదితరులు పాల్గొన్నారు. కాగా, రీజియన్‌లో సత్తుపల్లి డిపో, ఖమ్మం కొత్త బస్టాండ్‌తో పాటు ఐదుగురు ఉద్యోగులకు అవార్డులు రావడంపై ఆర్‌ఎం సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భవానీప్రసాద్, జీఎస్.పవిత్ర, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి, ఉద్యోగులు



అవార్డు అందుకుంటున్న ఖమ్మం డీఎం దినేష్‌కుమార్, ఎస్‌ఎం, పక్కన ఆర్‌ఎం సరిరామ్

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



కారేపల్లి పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరీక్షిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో ఆయన రేషన్ షాపులకు బియ్యం పంపిణీ, ప్రభుత్వ విద్యాసంస్థలకు సన్న బియ్యం సరఫరాపై సమీక్షించారు. బియ్యం నాణ్యతను అధికారులు తరచుగా పరిశీలించాలన్నారు. అలాగే, డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఆతర్వాత ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంక్ యజమానులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్‌ఓ చందన్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు ప్రమీల, శిరీష పాల్గొన్నారు.

కామేపల్లి: తహసీల్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణికి అందుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. కామేపల్లి తహసీల్‌లో పరిశీలించిన అనంతరం గోవింద్రాలలో డీలర్‌పై ఫిర్యాదుల నేపథ్యాన తనిఖీ చేశారు. తహసీల్దార్ సుధాకర్, ఆర్‌ఐలు సక్రు, రవి పాల్గొన్నారు.

కారేపల్లి: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. కారేపల్లిలోని కేజీబీవీతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేయగా ఆస్పత్రుల్లో సేవలపై ఆరా తీశారు. ఆతర్వాత కేజీబీవీ, హైస్కూల్‌లో వంట గది, మెనూ అమలును తనిఖీ చేయడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వైద్యాధికారి సురేష్, ఎస్‌ఓ ఝాన్సీసౌజన్య, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆశలకు 'రెక్కలు'

ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు ప్రభుత్వ ప్రాధాన్యత
- కొత్తగూడెంలో ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి కేంద్రం అనుకూలం
- ఆ తర్వాత ఎయిర్‌పోర్టు ఏర్పాటైతే పర్యాటక రంగానికి ఊతం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి జిల్లాలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భౌగోళిక, సామాజిక అంశాలు అనుకూలంగా ఉన్నాయి. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పం కూడా తోడైతే అతి త్వరలోనే జిల్లాకు విమానయాన సేవలు అందుబాటులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రభుత్వ ప్రాధాన్యతల్లో కీలకం..
రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న 19 పనులను నిర్ణీత కాల వ్యవధిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో టెంపుల్, ఎకో టూరిజం అభివృద్ధితో పాటు కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం కూడా ఉంది. రేవంత్‌రెడ్డి సీఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల తర్వాత ఆరు ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ ప్రకటన వచ్చింది. ఇందులో కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు కాగా వరంగల్, పెద్దపల్లి, ఆదిలాబాద్ బ్రౌన్‌ఫీల్డ్‌గా ఉన్నాయి. అయితే ఇందులో వరంగల్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికే తొలి ప్రాధాన్యత లభించే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

కేంద్రం సానుకూలం..
భద్రాద్రి జిల్లా సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న బస్తర్ ప్రాంతం మావోయిస్టుల కంచుకోటగా ఉంది. అక్కడి నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని తరిమేయడానికి కేంద్రప్రభుత్వం గత 15 ఏళ్లుగా అనేక ప్రయత్నాలు చేస్తోంది. మావోయిస్టులు – భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగినప్పుడు గాయపడిన జవాన్లను అనేక సార్లు భద్రాచలం వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి హెలికాప్టర్లలో మెరుగైన వైద్యం కోసం తరలించారు. కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లకు అవసరమైన మద్దతు వాయుమార్గంలో అందించేందుకు వీలు కలుగుతుంది. దీంతో కొత్తగూడెంలో ఎయిర్‌ఫీల్డ్ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉంది. ఈ మేరకు గత యూపీఏ, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వాలు పలుమార్లు ఇక్కడ సర్వే నిర్వహించాయి. మరోవైపు అయోధ్యలో బాలరాముడికి ఆలయం నిర్మించాక దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం అభివృద్ధిపై దృష్టి పెట్టాలనే ఒత్తిళ్లు కేంద్రంపై వస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం నుంచి కూడా తోడ్పాటు అందితే ఎయిర్‌ఫీల్డ్ అందుబాటులోకి వచ్చేందుకు ఆస్కారం ఉంది. ఆ తర్వాత దశలో ఎయిర్‌ఫీల్డ్‌ను ఎయిర్‌పోర్టుగా వినియోగించుకోవచ్చు.

టూరిజానికి అవకాశం..
భద్రాచలానికి భక్తులు ఎక్కువగా రోడ్డు మార్గంలో వస్తున్నారు. కొత్తగూడెం – పాల్వంచ – భద్రాచలం మధ్య ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశం నలుమూలల నుంచి భక్తులు భద్రాచలం వచ్చే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా ఇటు టెంపుల్ టూరిజంతో పాటు అటు ఎకో టూరిజం అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే కిన్నెరసాని జలాశయం దగ్గర ఎకో టూరిజంలో భాగంగా చేయాల్సిన అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా కన్సల్టెన్సీని నియమిస్తామని ప్రకటించింది. త్వరలోనే సీతమ్మసాగర్ పూర్తయి కరకట్ట నిర్మాణం జరిగితే సుమారు 40 కిలోమీటర్ల మేరకు గోదావరి తీరం వెంబడి జలాశయంతో పాటు రోడ్, బోట్ కనెక్టివిటీ పెరుగుతుంది. ఏపీలో పాపికొండలు, మారేడుమిల్లి, సీలేరు వంటి పర్యాటక ప్రాంతాలకు కొత్తగూడెం గేట్‌వేగా మారుతుంది. సినిమా షూటింగ్‌లకు అనవైన వాతావరణం ఏర్పడుతుంది.

పారిశ్రామిక రంగంలో..
జిల్లాలో సింగరేణి, హెవీ వాటర్‌ప్లాంట్, థర్మల్ విద్యుత్ కేంద్రం వంటి భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో నవభారత్, ఐటీసీ – పేపర్‌బోర్డు, పామాయిల్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. పాల్వంచలో సుమారు వెయ్యి ఎకరాల స్థలం పరిశ్రమలకు అనుకూలంగా ఉంది. జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరైతే పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు మరింతగా వచ్చేందుకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.

పదిహేనేళ్లుగా ప్రయత్నాలు
కొత్తగూడెంలో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి వెయ్యి ఎకరాల స్థలం అవసరం అవుతుందని అంచనా. యూపీఏ ప్రభుత్వ హయాంలో సుజాతనగర్ ఏరియాలో ఎయిర్‌పోర్టు వస్తుందని ప్రచారం జరిగినా అది కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడు చెలక పేరు కొన్నాళ్లు వార్తల్లో నానింది. చివరగా మూడేళ్ల కిందట ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు జిల్లాలో సర్వే నిర్వహించారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో గుడిపాడు, పేట చెరువు, బంగారుజాల ఏరియాల్లో వెయ్యి ఎకరాల స్థలం కోసం పరిశీలన చేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక బృందాలు టెక్నో ఎకనామిక్ ఫీజిబులిటీపై క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించాయి. ఇందులో ఎయిర్‌పోర్ట్‌కు బదులు ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు గల అవకాశాలను ఎక్కువగా పరిశీలించారు.

సంక్షేమం, అభివృద్ధికి పన్నులు దోహదం



హైకోర్టు జడ్జి నగేష్‌కు జ్ఞాపిక అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

జీఎస్టీ సెమినార్‌లో హైకోర్టు జడ్జి బీమపాక నగేష్

ఖమ్మంగాంధీచౌక్: ప్రభుత్వాల నేతృత్వాన సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్వహణకు పన్నులు దోహదపడతాయని హైకోర్టు జడ్జి బీమపాక నగేష్ తెలిపారు. ఖమ్మంలో శనివారం జాతీయ స్థాయి పన్నుల విధానం, ఆదాయ పన్ను అంశాలపై సెమినార్ నిర్వహించారు. జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్ల సౌత్ జోన్, తెలంగాణ టాక్స్ ప్రాక్టీషనర్ల అసోసియేషన్ల ఆధ్వర్యాన ఈ సదస్సు నిర్వహించగా న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు సౌకర్యాల కల్పనలో పన్నులు ఉపయోగపడతాయని తెలిపారు. దేశాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వాలు రూపొందించిన పన్నుల విధానాలను ప్రాక్టీషనర్లు సామాజిక బాధ్యతగా, కట్టుదిట్టంగా అమలు చేయాలని చెప్పారు. అనంతరం అసోసియేషన్ల బాధ్యులు, రిటైర్డ్ అధికారులు డాక్టర్ ఎంవీకే.మూర్తి, పీవీ.సుబ్బారావు, ఎంవీజేకే.కుమార్, ఊరెల్లి స్వరూప, డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఎ.నర్సింగరావు పన్నుల విధానాలను వివరించగా.. పలు అంశాలపై సతీష్ సరాఫ్, ఆశిష్ కుమార్ అగర్వాల్ మాట్లాడారు. అసోసియేషన్ సౌత్ జోన్ జాయింట్ సెక్రటరీ, కేజీపీఏ వైస్ ప్రసిడెంట్ ఉల్లిబోయిన సైదులు చైర్మన్‌గా వ్యవహరించిన ఈ సెమినార్‌లో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బూర్గల దుర్గాప్రసాదరావు, అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, కె.పవన్‌కుమార్‌తో పాటు జి.రమేష్, ఏ.శ్రీనివాసరావు, పి.గోపాల్, ఎస్.చక్రరమణ, పలువురు టాక్స్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

సామరస్య పరిష్కారానికే లోక్ అదాలత్‌లు

ఖమ్మం లీగల్: వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ వేదికగా నిలుస్తుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఖమ్మంలోని న్యాయ సేవాసదన్‌లో శనివారం ఆయన పలు ప్రీ లిటిగేషన్ కేసులకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు ప్రీ లిటిగేషన్ విధానంలో రాజీ పడితే విలువైన డబ్బు, సమయం ఆదా అవుతాయని తెలిపారు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలను పోషించడం చట్టప్రకారం కర్తవ్యమైనందున ఎవరూ తప్పించుకోలేరని.. ఇలాంటి కేసుల్లో తక్షణం రాజీ పడితే ఇరుపక్షాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కాగా, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు ఖమ్మం రూరల్ మండలంలోని జిల్లా జైలును సందర్శించి ములాఖత్, మహిళా ఖైదీల బ్యారక్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఓ కేసులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

క్లుప్తంగా

భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎంపీ



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పార్థసారథిరెడ్డి

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యాన హెటిరో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటిక్ సైన్సెస్(బీఫార్మసీ) కళాశాలకు అనుమతులు లభించాయి. ఈమేరకు భవన నిర్మాణాలకు శనివారం కళాశాల చైర్మన్, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధినేత బండి అన్విద శంకుస్థాపన చేశారు. బీఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా రవికుమార్, ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వూటుకూరి శేషరత్నకుమారి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ స్లిప్‌లు విడుదల చేయాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించి 2022–23, 2023 –24 సంవత్సరాల జీపీఎఫ్((జనరల్ ప్రావిడెంట్ ఫండ్) స్లిప్‌లను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే, జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేసి వివరాలను ఈ–పంచాయతీ సైట్‌లో పొందుపర్చాలని కోరారు. రెండేళ్లుగా జీపీఎఫ్ స్లిప్‌లు విడుదల చేయకపోవడంతో వేతనం నుంచి మినహాయించే నగదు విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈమేరకు అధికారులు స్లిప్‌లు విడుదల చేయడమే కాక అకౌంట్లను సరిచేయాలని, రుణాలకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని వారు కోరారు.

హైవే అలైన్‌మెంట్ మార్చాలని వినతి



రైతులతో చర్చలు జరుపుతున్న అధికారులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్ – అమరావతి నేషనల్ హైవే అలైన్‌మెంట్‌ను ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల నుండి కొదుమూరు వరకు మార్చాలని కామంచికల్‌లో భూములు కోల్పోతున్న రైతులు కోరారు. ఈసందర్భంగా రైతులతో చర్చలు జరపడానికి శనివారం వచ్చిన ఆర్‌డీఓ గణేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికే తమ వద్ద తీసుకున్న భూములకు తక్కువ పరిహారం చెల్లిస్తానని చెప్పారని.. అలా కాకుండా విలువైన భూములను వెనక్కి ఇచ్చేసి హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు. ఈ చర్చల్లో తహసీల్దార్ రాంప్రసాద్, ఎన్‌హెచ్ అధికారులతో పాటు నాయకులు బొంతు రాంబాబు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వి.రాధాకృష్ణ, సుధీర్, గాంధీ, వెంకటయ్య, పాటి వెంకటేశ్వర్లు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఎఫ్‌ఏ సస్పెన్షన్

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడు(ఎఫ్‌ఏ) రవీంద్రబాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ముజ్జుగూడెం పంచాయతీ పరిధిలో బౌద్ధక్షేత్రం వద్ద చేయించిన పనులు, మస్టర్ల నమోదులో అవకతవకలు జరిగినట్లు అందిన ఫిర్యాదుతో పదిహేను రోజుల్లోగా వివరణ ఇవ్వాలని అధికారులు నోటీసు జారీ చేశారు. అప్పటివరకు విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొనగా ఆయనకు ఎంపీడీఓ ఎం.ఎర్రయ్య శనివారం ఉత్తర్వులు అందించారు.

నర్సరీ వద్ద రైతుల ఆందోళన

కూసుమంచి: మండలంలోని ధర్మాతండా వద్ద ఏర్పాటు చేసిన మిరప నర్సరీ వద్ద శనివారం రాత్రి రైతులు ఆందోళనకు దిగారు. పలువురు రైతులు ఈ నర్సరీ నిర్వాహకులకు మిరప విత్తనాలు ఇచ్చి నారు పెంచుకున్నారు. అయితే, ఆ నారు నాటగా మొక్కలు చనిపోతుండగా ఇటీవల యజమానిని నిలదీశారు. ఆపై ఉద్యానవన అధికారి కూడా కొందరు రైతుల తోటలను పరిశీలించగా బాధిత రైతులకు నర్సరీ యజమాని నష్ట పరిహారం ఇస్తానని అంగీకరించాడు. అయినా ఇవ్వకపోవడంతో శనివారం రాత్రి ఆందోళనకు దిగగా ఎస్సై నాగరాజు చేరుకుని మాట్లాడారు. నాటిన మిర్చి తోటలను మరోమారు పరిశీలించి పరిహారం ఇస్తామని యజమాని హామీ ఇవ్వటంతో రైతులు వెనుదిరిగారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన వివాహిత రమ్యశ్రీ(40) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కొన్నాళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ఆమె భర్తకు దూరమై తల్లిదండ్రుల వద్ద పిల్లలతో ఉంటోంది. ఈక్రమాన భర్త దూరంగా ఉండడం, పిల్లలను పోషించడం కష్టంగా మారడంతో ఆవేదనకు గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై ఆమె తల్లి ఇందిర ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

కౌలుదారుల కబంధ హస్తాల్లో..

- సొసైటీ భూమిపై మాజీ ఎంపీటీసీ పన్నాగం
- ఇప్పటికే రూ.కోట్లకు పడగలెత్తిన కౌలుదారులు
- సొంత పొలంలో కూలీలుగానే గిరిపుత్రులు
- ఫలితంగా ప్రభుత్వ లక్ష్యానికి గండి



గిరిజన సొసైటీ భూమిలో పంటల సాగుకు కౌలు రైతు దున్నించిన దృశ్యం

సత్తుపల్లి: బంగారం పండే భూములు కౌలుదారుల కబంధ హస్తాలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. అమాయక గిరిపుత్రులను మభ్యపెట్టి ఏళ్లుగా కౌలు చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తుతుండగా... భూమి అభివృద్ధి చేశామంటూ కౌలు పొడిగిస్తూ పోతున్నారు. మరోపక్క సొంత భూమిలోనే గిరిజనులు కూలీలుగా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి సర్వే నెంబర్ 40/1లో అప్పటి జలగం వెంగళరావు ప్రభుత్వం ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీకి ఇచ్చిన భూములు గంగారం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నాయి. గంగారం వైపు 70 ఎకరాలు, రామగోవిందాపురం వైపు 55 ఎకరాలు ఉండగా.. గిరిజనులు ఆర్థికంగా బలపడాలని అప్పటి ప్రభుత్వం భూమి ఇస్తే ఇప్పుడు కౌలుదారులు కబంధ హస్తాల్లో చిక్కుకోవడంతో ప్రభుత్వ లక్ష్యానికి గండిపడినట్లయింది.

అరటి సాగుతో రంగప్రవేశం

మంచి సారవంతమైన ఎర్రమట్టి నేలలు కావడంతో ఈ భూమిపై ఆంధ్రాకు చెందిన కౌలుదారుల కన్ను పడింది. 1998లో భూమిని అభివృద్ధి చేసి పదేళ్ల తర్వాత ఇస్తానని చెప్పిన బాబ్జీ అనే రైతు నామమాత్రమే కౌలుతో 125 ఎకరాలు తీసుకున్నాడు. ఆ భూమిలో ఓ వైపు నాలుగుబోర్లు, మరో వైపు ఐదు బోర్లు వేసి విద్యుత్ కనెక్షన్ తీసుకోవడమే కాక చుట్టూ ఫెన్సింగ్ వేసి అరటి సాగు చేపట్టాడు. ఈ పంట ద్వారా సదరు వ్యక్తికి రూ.కోట్లలో ఆదాయం సమకూరిందని ఇప్పటికీ చెప్పుకుంటారు. ఈ విషయమై 2008లో 'సాక్షి'లో కౌలుదారు అరటి దందాపై కథనాలు రావడంతో ఆయన భూమి వదిలేసి వెళ్లాడు.

ఇప్పుడు స్థానికుల వంతు

ఆంధ్రా కౌలు రైతు వెళ్లాక స్థానికులే కొందరు కౌలు రైతులుగా అవతారమెత్తారు. ఇరవై ఎకరాల్లో జామాయిల్, 30 ఎకరాల్లో చెరుకుతో పాటు ఇంకో 40 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఎకరా కౌలుకు రూ.15 వేల నుంచి రూ.16వేలు ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. అప్పటికే భూమిలో బోర్లు ఉండడంతో లాభాల పంట పండుతోంది. ఓ మాజీ ఎంపీటీసీ ఈ భూమినంతా సామ్రాజ్యంలా భావించి మరికొందరికి కౌలుకు ఇచ్చినట్లు గిరిజన సంఘాల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాక గిరిజనుల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. కౌలు లెక్కలు కూడా సరిగా చూపకపోవడంతో గిరిజన మహిళలు ఇటీవల నిలదీయగా తమకు అనుకూలమైన గిరిజనులతో భూమిలోకి రానివ్వకుండా అడ్డుపడ్డారనే పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇటీవల ఓరోజు రాత్రి మాజీ ఎంపీటీసీ కొందరు గిరిజనులను రెచ్చగొట్టి భూమి దున్నేందుకు వెళ్లడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇకపోతే ఎకరానికి రూ.25వేలు కౌలు ఇస్తానని వేరే వ్యక్తి పోటీకి రావడంతో ఆయనపైకి సైతం గిరిజనులను ఉసిగొల్పడంతో వివాదం ముదురుతోంది. ఇతరులను ఎవరినీ కౌలుకు రానిచ్చే ప్రశ్నేలేదంటూ మాజీ ఎంపీటీసీ అడ్డుపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సొంత భూముల్లోనే కూలీ పని

సొసైటీ భూముల్లో యజమానులైన గిరిజనులే కౌలు రైతుల వద్ద కూలీలుగా పని చేస్తున్నారని తెలుస్తోంది. ఈ అంశంపై కొందరు కౌలుదారులు మాజీ ఎంపీటీసీని నిలదీసినప్పటికీ వారిపై అక్రమ కేసులు బనాయిస్తానని భయపెట్టడంతో నోరు మెదపకుండా పనులు చేస్తున్నారని సమాచారం. అంతేకాక అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ఈ భూములన్నీ గిరిజనులే సాగు చేస్తున్నారని చెప్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాక గిరిజనుల పేరిట కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి వస్తున్న రాయితీలను కూడా వాడుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయమై అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి అర్హులైన గిరిజనులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

పామాయిల్ తోటలు కూడా..

మరో ఇద్దరు స్థానిక కౌలు రైతులైతే ఏకంగా పదిహేను ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. గిరిజన భూములను కౌలుకు తీసుకుని ఆయిల్‌పామ్ సాగు చేయొద్దని నిబంధనలు చెబుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.



సొసైటీ భూముల్లో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోట

ఎస్‌బీఐటీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టా అందజేస్తున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్ రామసురేష్, ఎస్‌బీఐటీ యాజమాన్యం కృష్ణ, ధాత్రి తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌బీఐటీ(అటానమస్) కళాశాలలో 2020–24 విద్యాసంవత్సరం గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బీ.వీ.రామనరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. కళాశాల అందించిన విద్యా, నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కళాశాల నుంచి అత్యధికంగా విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ప్లేస్‌మెంట్లు సాధించడం అభినందనీయమన్నారు. గత 21ఏళ్లుగా విద్యార్థులకు ఉత్తమ సాంకేతిక విద్యనందిస్తూ న్యాక్ ఏ ప్లస్, అటానమస్ హోదా సాధించటం శుభపరిణామమని తెలిపారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థి దశను ముగించుకుని ఉద్యోగ దశలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు, అందుకు కృషి చేసిన అధ్యాపకులు అభినందనీములని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్లు జి.ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, నూనె శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రామకృష్ణ
- విద్యార్థులతో కలిసి కేఎంసీ కార్యాలయం ముట్టడి



కేఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



కేఎంసీ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రాల్లోని సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలనే డిమాండ్‌తో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యాన విద్యార్థులతో కలిసి శనివారం ఖమ్మం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈక్రమంలో లోనకు వెళ్లేందుకు యత్నించిన వారిని పోలీసులు అడ్డుకోవడం గేటు వద్దే బైఠాయించి నినాదాలు చేశారు. ఆతర్వాత కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ వచ్చి సమస్యలు తెలుసుకుని వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ పలు హాస్టళ్లలో పారిశుద్ధ్యం లోపించి పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, ఫలితంగా విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. అయినా విద్య, వైద్య, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి కేఎంసీ ద్వారా నల్లా కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు షేక్ నాగులమీరా, మధు, శివనాయక్, వంశీ, బూర మనోజ్, రాకేష్, ప్రతాప్, పవన్, మౌనిక, వేద, కీర్తి, వేదన, శ్రీలత, స్వాతి, రజిని, రమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు అవార్డులు



అవార్డులు అందుకున్న వారితో అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం సర్కిల్ పరిధిలో ప్రతిభ కనబర్చిన అధికారులకు ఎన్పీడీసీఎస్ స్థాయిలో అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా జూన్, జూలైకు సంబంధించిన అవార్డులను ఖమ్మంలోని విద్యుత్ గెస్ట్ హౌస్‌లో శనివారం అధికారులు అందజేశారు. సత్తుపల్లి, ఖమ్మం టౌన్–2 ఏడీలు బి.ప్రసాద్‌బాబు, వై.రమేష్‌కుమార్, సత్తుపల్లి డీఈ రాములు, తల్లాడ, ఖమ్మం టౌన్–1 ఏడీఈలు ఖాదర్ బాబా, సీహెచ్.నాగార్జున అవార్డులు అందుకున్నారు. అలాగే, కుర్నవల్లి, ఖమ్మం టౌన్–5, కల్లూరు, ఖమ్మం టౌన్–1, గొల్లపూడి, ఆరెంపుల, ముదిగొండ, సత్తుపల్లి ఏఈలు పి.సుందర్‌కుమార్, ప్రభాకర్‌రావు, హెచ్.రాజేష్, ఎం.మౌలిక, పి.వెంకటసాయికుమార్, ఏ.అనంతప్రకాష్, బీమ్‌సింగ్, సుజాతకు ఎస్ఈ ఏ.సురేందర్, ఎన్పీడీసీఎల్ కార్యాలయానికి చెందిన ఎస్ఈ నాగప్రసాద్ అవార్డులు అందజేసి అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం, కాపర్ వైరు చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు, ఎదుళ్లచెరువు గ్రామాల్లో ఇటీవల పది మంది రైతుల బావుల వద్ద మోటార్ల కాపర్ వైర్లను చోరీ చేయగా.. శనివారం ఏలువారిగూడెం పరిధి 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు కాపర్ వైర్ ఎత్తుకెళ్లారు. ఘటనపై బచ్చోడు ఏఈ శంకర్ చేసిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దిమ్మె నుండి క్రిందకు దింపి ధ్వంసం చేయగా రూ.50వేల విలువైన కాపర్ వైర్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

ఇంటింటా జ్వరమే...



ఆస్పత్రిలో నిండిన బెడ్లు...

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఏ ఇంట్లో చూసినా ఒకరిద్దరు జ్వరంతో బాధపడుతున్నారు. ఇటీవల వర్షాలతో పారిశుద్ధ్య సమస్య ఏర్పడడమే జ్వరాల వ్యాప్తికి కారణమని తెలుస్తోంది. నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి గత రెండు రోజులుగా 350 నుంచి 400 వరకు ఓపీ నమోదవుతోంది. చలి జ్వరం, తలనొప్పి, దగ్గు, నీరసం, నొప్పుల వంటి సమస్యలతో వస్తున్న వారితో హాస్పిటల్ కిటకిటలాడుతోంది. కాగా, ఇకనైనా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు దృష్టి సారించి గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.



నేలకొండపల్లి ఆస్పత్రి వద్ద క్యూలో ఉన్న జ్వరపీడితులు

రైతులకు మెరుగైన సేవలే ప్రధానం



సన్మాన సభలో మాట్లాడుతున్న ఏఓ భాస్కరరావు

రఘునాథపాలెం: ప్రభుత్వం – రైతుల నడుమ వారధిగా నిలుస్తూ అన్నదాతలకు మెరుగైన సేవలందించడమే వ్యవసాయశాఖ అధికారుల లక్ష్యమని పలువురు పేర్కొన్నారు. ఇటీవల బదిలీ అయిన జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కరరావును శనివారం రఘునాథపాలెం రైతు వేదికలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏఓ భాస్కరరావు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా తాను రైతుల సహకారంతో విజయవంతంగా విధులు నిర్వర్తించానని తెలిపారు. అనంతరం విజయనిర్మల, శ్రీని వాసరావు మాట్లాడగా సొసైటీల చైర్మన్లు తాత రఘురాం, మందడపు సుధాకర్, ఖమ్మం ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావుతో పాటు తుమ్మలపల్లి మోహన్‌రావు, మందడపు నర్సింహారావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులో చోరీ

రూ.2.85లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు



షాపులోని నగదును కవర్‌లో వేసుకుంటున్న నిందితుడు (సీసీ కెమెరా పుటేజీ)

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో మురళీకిషోర్ ఆగ్రో ఏజెన్సీ పేరిట కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల షాపులో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం యజమాని రోజులాగే షాపు మూసేసి పై అంతస్తు ఉన్న ఇంట్లో నిద్రించాడు. సరుకులు అమ్మగా వచ్చిన రూ. 2.85 లక్షల నగదును షాపులోనే భద్రపరిచాడు. ఈ మేరకు అర్ధరాత్రి షట్టర్ తాళాలు పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు నగదును ఎత్తుకెళ్లారు. ఈమేరకు శనివారం ఉదయం గుర్తించిన యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో ఫిర్యాదుతో రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్, క్లూస్ టీంతో కలిసి సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. ముందుగా గోదాం తాళం పగులగొట్టిన నిందితులు ఆతర్వాత పక్కనే ఉన్న షాపు షట్టర్ తొలగించి చోరీకి పాల్పడినట్లు గుర్తించగా దర్యాప్తు చేపట్టారు.

కుక్కల బెడదను అరికట్టేలా..

జిల్లా కేంద్రంలో నానాటికీ కుక్కల సంతతి పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యాన నియంత్రణకు కేఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలోని పలు ప్రాంతాలకు శనివారం సిబ్బందిని పంపించగా వారు కుక్కలను వలలతో బంధించి ఏబీసీ సెంటర్‌కు తరలించారు. అక్కడ శస్త్రచికిత్స చేశాక వదిలేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ప్రత్యేక బోన్‌లోకి ఎక్కించిన కుక్కలు



వల వేసి కుక్కలను పడుతున్న సిబ్బంది

జ్వరంతో చిన్నారి మృతి



అఫ్షా సిద్దికా (ఫైల్)

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్‌కు చెందిన ఐదేళ్ల చిన్నారి జ్వరంతో బాధపడుతూ మృతి చెందింది. షేక్ అక్బర్–నూర్జాహాన్ దంపతులు కూలీ పనులు చేస్తూ ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నారు. ఇందులో చిన్న కుమార్తె అఫ్షా సిద్దిఖా(5) ఎల్‌కేజీ చదువుతుండగా, గురువారం తీవ్ర జ్వరం రావడంతో వైరాలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైద్యుల సూచనలతో ఖమ్మం తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగానే పరిస్థితి విషమించగా మరో ఆస్పత్రికి తరలించే క్రమంలో అఫ్షాకు ఫిట్స్ రాగా మృతి చెందింది. ఈక్రమాన శనివారం ఉదయం శాంతినగర్‌కు తీసుకొచ్చి ఆమె అంత్యక్రియలు నిర్వహించగా తల్లిదండ్రులు, బంధువులు రోదించిన తీరు స్థానికులను కంట తడి పెట్టించింది.

గుర్తు తెలియని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. గ్రామంలోని చింతకాని రోడ్డులో సదరు వ్యక్తి శుక్రవారం రాత్రి పడుకోగా, నిద్రలోనే మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తుండగా, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



కొర్రా ఏసు (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని లంకపల్లికి చెందిన కొర్ర ఏసు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. గ్రామంలో తమ ఇంట్లో అన్నప్రాసన ఇంట్లో అన్నప్రసాన కార్యక్రమానికి వచ్చిన ఆయన అక్కడ విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో మరమ్మతుకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురికాగా ఆయనను బంధువులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేలోగా అప్పటికే ఏసు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

జ్వరంతో వృద్ధురాలు...



సామ్రాజ్యం (ఫైల్)

పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన ఇడుపుగంటి సామ్రాజ్యం(67) జ్వరంతో బాధపడుతూ మృతి చెందింది. పదిహేను రోజులుగా ఆమె జ్వరంతో బాధపడుతుండగా తొలుత పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో ఏపీలోని మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూనే గుండెపోటు రావడంతో సామ్రాజ్యం మృతి చెందింది.

గుండెపోటుతో రైతు...



కృష్ణ (ఫైల్)

పొలం వద్దకు వెళ్లివస్తున్న ఓ రైతు గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఇది. పెనుబల్లి మండలం బ్రహ్మళకుంట గ్రామానికి చెందిన రైతు భూక్యా కృష్ణ(46) శనివారం తన ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళ్లి వస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలగా స్థానికులు గమనించేలోగా ఆయన మృతి చెందాడు. రైతు కృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గాయపడిన వృద్ధుడు...

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండాకు చెందిన తేజావత్ ధంజ్యా(68) శుక్రవారం రాత్రి గ్రామంలో నడిచి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.